

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## స్వర్గం

**నలభై ఐదేళ్ళ** పద్మిని కలగంటోంది. కలలో ఆమె మేనకోడలు సుమ పిలుస్తోంది.

"అత్తా. అత్తా లే."

"ఏమిటి?" పద్మిని విసుగ్గా అడిగింది.

"ఓసారి అటు చూడు. ఆయనెవరో గుర్తుపట్టావా?"

పద్మిని తల తిప్పి చూసింది. స్థంభానికి ఆనుకుని, ఓ కాలిని వెనక్కి మడిచి చేతులు కట్టుకుని తనవంకే నవ్వుతూ చూస్తున్న ఓ అందగాడు కనిపించాడు. ఎక్కడో చూసానే అనుకుంటూండగానే చటుక్కున గుర్తొచ్చాడు. బాంబే డైయింగ్ అందగాడు. యవ్వనపు రోజుల్లో తనని అమితంగా ఆకర్షించిన మోడల్. అతనిపేరు కూడా వెంటనే స్ఫురించింది. అర్ధేందు బోస్!

"ఇతను ఇప్పుడు ఇక్కడికెందుకు వచ్చాడు?" అనుమానంగా అడిగింది.

"అత్తా! ఈయనకి నువ్వంటే చాలా ప్రేమట. తనతో రమ్మంటున్నాడు."

"ఛీ.ఛీ!" పద్మినికి కోపం వచ్చింది.

"నిన్ను ప్రేమగా చూసుకుంటాడట." సుమ గుసగుసగా చెప్పింది.

"ఇంకా నయం. మీ మామయ్య వింటే నిన్నూ నన్నూ కూడా చంపేస్తారు. వెళ్ళమను ఆయన్ని."

"అంత ప్రేమగా పిలుస్తున్నాడుగా అత్తా?"

"నేను లేకపోతే మామయ్యకి ఒక్క క్షణం కూడా గడవదు తెలుసా?"

"నువ్వు గారాబం చేసి చెడగొట్టావులే. ఏం పెళ్ళికి ముందు తన పని తను చేసుకోలా?" సుమ తృణీగారంగా చెప్పింది.

"ఇంట్లో ఏవి ఎక్కడున్నాయో కూడా ఆయనకి తెలీదు. ఆఖరికి అండర్‌వేర్, బనీన్ కూడా నేనివ్వాల్సిందే"

"మీ ఇల్లేమైనా పేలసా? ఒకరోజు వెతుక్కుని, ఏవి ఎక్కడున్నాయో గుర్తుపెట్టుకుంటాడ్లే. పద."

"అయ్యో సుమా. చిన్నపిల్లవి. నీకేం తెలీదు. విను. మామయ్యకి ఏ కూరలు ఇష్టమో, ఏ బ్రేక్‌ఫాస్ట్ ఇష్టమో, ఏ స్నాక్స్ ఇష్టమో, కాఫీ ఎలా కలిపితే ఇష్టమో నాకు మాత్రమే తెలుసు. నేను లేకపోతే అల్లాడిపోతారు తెలుసా?" చిరుగర్వంగా చెప్పింది.

"పెళ్ళికి ముందు పాతికేళ్ళదాకా ఏం తిన్నాట్ట? సరే. నీకు ఏ కూరలు ఇష్టమో, ఏ స్నాక్స్ ఇష్టమో, కాఫీ ఎలా కలిపితే ఇష్టమో మామయ్యకి తెలుసా?"

పద్మిని మౌనం వహించింది.

"అదేమరి బోస్‌గారు నీకు ఇష్టమైన వెజిటబుల్సే తెస్తారట. మామయ్యకి ఇష్టంలేదని నువ్వు మానేసిన గోంగూరలాంటివన్నీ తనకీ ఇష్టమేనట. మామయ్య అసలు ఇష్టపడని నీ ఇష్టమైన పదార్థాలన్నీ మీ మెనూలో ఉంటాయట." సుమ నచ్చచెప్పింది.

"ఇంటి వ్యవహారాలేమీ ఆయనకి తెలీవు పాపం. ఎప్పుడూ పావలా పెట్టి ఏమీ కొనలేదు. అన్నీ నేనే చూసుకోవాలి."

"అవును. చేతులు పడిపోయేట్లు సంచిలు మోసుకుంటూ షాపుల చుట్టూ నీలాంటి పిచ్చిది తిరుగుతుంది కానీ మామయ్యలాంటి కులాసా పురుషుడు తిరుగుతాడా? నిజం చెప్పు నీకోసం కనీసం పావలా మల్లెపూలన్నా తెచ్చాడా ఏనాడైనా?"

"అబ్బ సుమా! ప్లీజ్ విసిగించకు."

"బోస్‌గారు పువ్వుల్లో పెట్టి చూసుకుంటారట అత్తా. పద ఆయనతో వెళ్ళిపోదాం."

"నేనిలా ఈ వయసులో ఎవరితోనో వెళ్ళిపోతే ఆయన పరువేమౌతుంది? పాపం అవమానాన్ని ఎలా తట్టుకుంటారు?"

"మరి పదిమందిలో నిన్ను ఇష్టం వచ్చినట్లు మాట్లాడినప్పుడు నీ మీదకి వస్తువులు విసిరేసినప్పుడు నీ పరువేమైంది? ఏం నీకు పరువులేదా?"

"ఇంటి వ్యవహారాలేమీ ఆయనకి తెలీవు పాపం. ఎప్పుడూ పావలా పెట్టి ఏమీ కొనలేదు. అన్నీ నేనే చూసుకోవాలి."

పద్మిని నమస్కారం పెట్టి చెప్పింది.

"వెళ్ళిపొండి సుమా. ప్లీజ్. నేనెక్కడికీ రాను."

"అంతేలే అత్తా. నువ్వు లేకపోతే సూర్యోదయంకూడా జరగదు అనే భ్రమలో ఉన్నావ్. మామయ్యకి వేరే ప్రపంచాలు ఉన్నాయి. ఫ్రెండ్స్, ఆఫీస్, బంధుమిత్రులు, సినిమాలు, క్రికెట్ ఆయనేమీ నీకోసం ఒక్కదాన్ని కూడా త్యాగం చేయలేదు. తనకి ఇష్టమైనట్లే జీవిస్తున్నాడు. మరి నువ్వు? ఆయనే లోకం. ఇల్లే ప్రపంచం. ఆయన ఇష్టాలే ఇష్టాలు. వ్యక్తిత్వం చంపుకున్నావు అత్తా. నీకోసం నువ్వు గోంగూర పచ్చడి కూడా చేసుకోలేనంత అసహాయురాలివయ్యావు. అది చేసుకుతింటే ఆయనేం నిన్ను చంపేయడు. తను తినడు అంతే. కానీ నువ్వు అన్నీ ఆయనకి ఇష్టమైనట్లే చేయాలి అనే పతివ్రతాభావంతో ప్రవర్తిస్తున్నావు. పాతికేళ్ళనించి కాపురం చేస్తున్నా, పుట్టింటికెళ్ళి పదిరోజులు ఉండివస్తావని అడగడానికి మొహమాటపడుతున్నావు. దానికి 'నేను లేకపోతే ఆయనకి క్షణం జరగదు' అనే అందమైన పూత పూస్తున్నావు. నువ్వు ఎవర్ని మోసం చేస్తున్నావు? నిన్ను నువ్వే మోసం చేసుకుంటున్నావు. పాతికేళ్ళు బతికావుగా ఇంకో పాతికేళ్ళు సునాయాసంగా బతుకుతావులే" సుమ కోపంగా చెప్పింది.

"చాల్లే ఆపు. దయచేసి అతన్ని తీసుకుని వెళ్ళిపో. నేను ఎక్కడికీ రాను. నా ఇల్లే నాకు స్వర్గం. నా భర్త నాకు నారాయణుడు. సరేనా? "

పద్మిని చేతులు జోడించింది. అర్ధేందు ఆమె వంక చిరాశగా చూస్తూ, వెనక్కి తిరిగి చూసుకుంటూ వెళ్ళిపోయాడు.

"ఏంటా మొద్దునిద్ర. ఆరుదాటింది. లే ఇంక." "

భర్త మేలుకొలుపుకి మెలుకువ వచ్చిన పద్మిని, 'ఇదేంటి ఇలాంటి పీడకల వచ్చింది' అనుకుంటూ చెంపలు వేసుకుంది.

"పద్మినీ. నా ఫోన్‌కి ఛార్జ్ ఉందో లేదో చూసుకుని ఛార్జ్ చేయచ్చుగా? ఇప్పుడు 2% ఉంది. ఇంపార్టెంట్ కాల్స్ వస్తాయి. నీకసలు బుద్ధిలేదు" సీతారాం చిందులు తొక్కుతున్నాడు.

"అయ్యో! మీ ఫోన్‌ని ముట్టుకోనివ్వరుగా. అందుకే దాని జోలికి వెళ్ళలేదు" వంటగదిలో సతమతమౌతున్న పద్మిని అరిచి చెప్పింది.

"మాటకి మాట సమాధానం ఇవ్వడం బాగ నేర్చావు. నీకు పొగరు ఎక్కువైంది" విసుక్కుంటూ ఫోన్‌ని ఛార్జ్‌లో పెట్టాడు.

"రోజూ ఇడ్లీలేనా?" విసుక్కుంటూ బ్రేక్‌ఫాస్ట్ చేసాడు.

"రేపు పెసరట్ చేస్తాను" పద్మిని వినయంగా చెప్పింది.

"అదేదో ఇవాళే ఏడవచ్చుగా?"

"ఇవాళే అనుకున్నాను. కానీ లేవడం లేటవడంతో" గొణిగింది.

"రాత్రి పదకొండుదాకా ఆ వెధవ టి.వి చూస్తుంటే అంతేమరి. ఈరోజు నించి రాత్రి పదిగంటలకల్లా టి.వి, లైట్లు ఆరిపోవాలి ఇంట్లో" శాసించాడు.

మౌనంగా తలూపింది.

"నా ఆఫీస్ బేగ్ ఎందుకు కెలికావు?" బేగ్ సర్దుకుంటూ అరిచాడు.

"రామరామ. నేను ముట్టుకోలేదు" కంగారుగా చెప్పింది.

"మరింత చిందరవందరగా ఉందేం? ఇంట్లో మనిద్దరం కాక ఇంకెవరైనా ఉన్నారా?" వ్యంగ్యంగా అడిగాడు.

"రాత్రి మీరేకదా, ఏదో పేపర్ కనపడలేదని వెతికి, రేపొద్దున సర్దుకుంటాలే అన్నారు?" ధైర్యంగా చెప్పింది.

"నోర్మూసుకుని పనిచేసుకో. నువ్వేం దెప్పిపొడవక్కర్లేదు." చెప్పి విసురుగా వెళ్ళిపోయాడు.

తలుపు మూసిన పద్మిని ఓ నిమిషం తలుపుకి ఆనుకుని నిస్సహాయంగా ఉండిపోయింది. తర్వాత చిన్నగా నిట్టూర్చి అనుకుంది.

"బాంబేడైయింగ్ అందగాడికి యస్ చెప్పి ఉండాల్సింది."

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments